అశ్వారావుపేట ఎస్సై శ్రీను మృతి

- ఉన్నతాధికారి వేధింపులు తాళ లేక వారంరోజుల క్రితం ఆత్మహత్యాయత్నం
- చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో మృతి
- దోషులను శిక్షించాలని దళితసంఘాల ఆందోళన


ఎస్సై శ్రీరాముల శ్రీను(ఫైల్)

అశ్వారావుపేట, జూలై 7 : వారంరోజుల క్రితం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీను(38) ఆదివారం మృతిచెందారు. వివరాల్లోకెళ్తే.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వారావుపేట పోలీస్‌స్టేషన్లో ఎస్సైగా పని చేస్తున్న శ్రీను సీఐ జితేందర్‌రెడ్డి వేధింపులు, స్టేషన్‌లో నలుగురు కానిస్టేబుళ్ల సహాయ నిరాకరణ కారణంగా జూన్ 30వ తేదీన ఆత్మహత్యయత్నానికి పాల్పడిన సంగతి విదితమే. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీను ఆదివారం తెల్లవారుజామున మృతిచెందారు. ఎస్సై స్వస్థలం మహబూబాబాద్ జిల్లా నల్లబెల్లి మండలం నారక్కపేట గ్రామం. 2014లో ఎస్సైగా ఎంపికైన శ్రీను జిల్లాలోని పలు మండలాల్లో పనిచేశారు. మణుగూరు నుంచి ఫిబ్రవరి నెలలో అశ్వారావుపేటకు బదిలీపై వచ్చారు. తన భర్త శ్రీను ఆత్మహత్యకు సీఐ, కానిస్టేబుళ్లే కారణమని ఎస్సై భార్య కృష్ణవేణి ఫిర్యాదు మేరకు హైదరాబాద్ మార్కెట్ పోలీస్‌స్టేషన్లో జీరో ఎఫ్ఐఆర్(ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు) నమోదు చేసి తదుపరి విచారణకు కేసును మహబూబ్‌బాద్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. ఈ ఘటనపై స్పందించిన పోలీస్ ఉన్నతాధికారులు సీఐ జితేందర్‌రెడ్డిని ఐజీ కార్యాలయానికి, అదేవిధంగా మరో నలుగురు కానిస్టేబుళ్ళను ఎస్పీ కార్యాలయానికి ఎటాచ్ చేశారు. ఎస్సై మృతిచెందడంతో బాధ్యులను కఠినంగా శిక్షించాలని దళితసంఘాల ఆధ్వర్యంలో ఆదివారం అశ్వారావుపేటలో రాస్తారోకో నిర్వహించారు. ఎస్సై కుటుంబానికి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఎస్సై మృతి బాధాకరం : మాజీ ఎమ్మెల్యే మెచ్చా

ఎస్సై ఆత్మహత్యకు కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఎస్సై కుటుంబానికి రూ.కోటి పరిహారంతో పాటు ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు. ఉన్నతాధికారుల వేధింపులతో ఆత్మహత్యకు పాల్పడడం కాంగ్రెస్ ప్రభుత్వ సైకో పాలనకు నిదర్శనమని మండిపడ్డారు. రైతులు, నిరుద్యోగులు, ఉద్యోగులను సైతం వేధింపులకు గురిచేస్తుందని ఆరోపించారు. వేధింపులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా కాంగ్రెస్ నేతల సిఫార్సులతో కనీసం విచారణ కూడా జరపకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించి దళిత ఎస్సై మృతికి కారణమైయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ 10 ఏండ్ల పాలనలో ఇలాంటి ఆరాచకాలు ఎక్కడా చూడలేదని, కాంగ్రెస్ ప్రభుత్వంలో హత్యలు, ఆత్మహత్యలు నిత్యకృత్యం అయ్యాయని అసహనం వెలిబుచ్చారు. ఎస్సై శ్రీను మృతి ఘటన అత్యంత బాధాకరమని సంతాపం ప్రకటించారు. అలాగే ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఎస్సై కుటుంబానికి సానుభూతి ప్రకటించి విచారం వ్యక్తం చేస్తూ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఎస్సై శ్రీను మృతదేహంతో జాతీయ రహదారిపై బైఠాయింపు

- మూడు గంటలపాటు ఉద్రిక్తత
- ఎస్పీ రోహిత్‌రాజ్ హామీతో ఆందోళన విరమణ

నల్లబెల్లి, జూలై 7 : ఎస్సై శ్రీను మృతికి బాధ్యులను అరెస్ట్ చేయాల్సిందేనని వరంగల్ రూరల్ జిల్లాలోని నల్లబెల్లి మండలం నారక్కపేట జాతీయ రహదారిపై కుటుంబసభ్యులు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, బీఆర్ఎస్, దళిత సంఘాల నాయకులు బైఠాయించారు. దీంతో మూడు గంటలపాటు ఉద్రిక్తత నెలకొనగా, భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ హామీతో ఆందోళన విరమించారు. రహదారిపై ఎస్సై మృతదేహంతో రాస్తారోకో చేస్తున్న విషయం తెలుసుకున్న భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజ్ అక్కడకు చేరుకుని మాజీ ఎమ్మెల్యే పెద్దితోపాటు మృతుడి భార్య, కుటుంబసభ్యులతో చర్చలు జరిపారు. ఎస్సై భార్యకు ప్రభుత్వ ఉద్యోగంతోపాటు ఎక్స్‌గ్రేషియా అందించేలా చర్యలు చేపడుతామని, శ్రీనివాస్ మృతికి కారకులైన వారిని తక్షణమే అరెస్ట్ చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో మృతుడి బంధువులు రాస్తారోకో విరమించి అంత్యక్రియలు నిర్వహించారు.

అమ్మకానికి 'అసైన్డ్'

- ప్లాట్లు చేసి విక్రయిస్తున్న ఓ వ్యక్తి
- తెలియక మోసపోతున్న అమాయక ప్రజలు
- ఖమ్మం నగరం బాలప్పేటతండా శివారు బల్లేపల్లి రెవెన్యూలో తంతు

అమ్మకానికి పెట్టిన అసైన్డ్ భూమి

రఘునాథపాలెం, జూలై 7: ప్రభుత్వం పేద రైతులకు కేటాయించిన అసైన్డ్ అక్రమార్కులకు వరంగా మారుతుంది. అసైన్డ్‌పై కన్నేసిన రియల్ వ్యాపారులు.. రైతుల వద్ద అడ్డికి పావుసేరుకి భూములను కొనుగోలు చేసి ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారు. రూ.లక్షల పెట్టుబడితో తక్కువ సమయంలో రూ.కోట్లు గడిస్తున్నారు. అసైన్డ్ అని తెలిసి ప్లాట్లుగా మార్చి విక్రయించి అమాయక ప్రజలను బురిడీ కొట్టిస్తున్నారు. తెలియని అమాయక ప్రజలు సదరు భూముల్లో వేసిన ప్లాట్లు కొనుగోలు చేసి మోసపోతున్నారు. ఖమ్మం నగరం బాలప్పేట తండా శివారులో అమ్మకానికి పెట్టిన అసైన్డ్ భూమిలో ప్లాట్ల అమ్మకాలపై స్థానికులు 'నమస్తే' దృష్టికి తీసుకొచ్చారు. ఒకప్పుడు గుట్టగా ఉన్న అసైన్డ్ భూమిని కొనుగోలు చేసి ఓ వ్యక్తి చదును చేసి ప్లాట్లుగా విక్రయిస్తున్న వైనంపై కథనం.

బాలప్పేట తండా శివారు బల్లేపల్లి రెవెన్యూ సర్వే నెం 138/27, 137/7లో నాటి ప్రభుత్వం దళితులు సాగు చేసుకొనేందుకు ఒక్కొక్కరికి 2 నుంచి నాలుగెకరాల వరకు కేటాయించింది. 1980 అసైన్డ్ చట్టం ప్రకారం ఇచ్చిన భూములు కొనడానికి కానీ, అమ్మడానికి కానీ వీలు లేదు. అమ్మినట్లు రుజువైతే ప్రభుత్వం ప్రొవిజనల్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్(పీవోటీ) యాక్ట్ ప్రకారం సదరు ప్రభుత్వం ఆ భూమిని తన ఆదీనంలోకి తీసుకుంటుంది. కానీ నిబంధనలకు విరుద్ధంగా బాలప్పేట తండా శివారులోని ఆరు ఎకరాల్లో దళితులకు కేటాయించిన భూములు ప్లాట్లుగా మార్చి అమ్మకానికి పెట్టారు. రిజిస్ట్రేషన్ చేయించే అవకాశం లేకపోవడంతో ప్లాట్లుగా చేసిన వ్యక్తి అగ్రిమెంటు కాగితం చేతిలో పెట్టి మోసగిస్తున్నాడు. డబ్బులు కట్టాక రిజిస్ట్రేషన్ విషయమై ప్రశ్నిస్తే.. కార్పొరేషన్‌లో ఇంటి నెంబర్ ఇప్పిస్తానంటూ బురిడీ కొట్టిస్తున్నాడు. అంతేకాదు కొనుగోలు చేసిన ప్లాటులో చిన్నపాటి షెడ్డు సైతం వేయించి ఇంటి నెంబర్ వస్తది.. అంటూ మాయమాటలతో రోజులు వెల్లదీస్తున్నాడు. సదరు అసైన్డ్ భూమిని కొనుగోలు చేసిన వ్యక్తి చుట్టూ ప్రీకాస్ట్ వాల్ నిర్మించి అందంగా ముస్తాబు చేయడంతో విషయం తెలియని జనం మోసపోతున్నట్లుగా తెలియవస్తోంది. నగర పరిధిలో అగ్గువకు ప్లాటు రావడంతో అమాయక ప్రజలు కొనుగోలు చేసి అగ్రిమెంట్లు చేసుకుంటున్నారు.

తొలగించాలని నోటీసులు ఇచ్చాం..
(ఖమ్మం అర్బన్ గిర్దావర్-1, రమేశ్)

అసైన్డ్ భూమిని ప్లాట్లుగా చేసి విక్రయిస్తున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు గత నెలలో నోటీసులు జారీ చేశాం. అంతే కాదు నేరుగా భూమిని సందర్శించి ప్లాట్లుగా విక్రయిస్తున్న వ్యక్తితో మాట్లాడి ప్రీకాస్ట్ వాల్, అందులో నిర్మాణాలను తొలగించాలని ఆదేశించాం. అసైన్డ్ భూమిలో ప్లాట్లు కొనుగోలు చేసి మోసపోవద్దు. రెండు రోజుల్లో సైట్ విజిట్ చేసి అందులో ఉన్న నిర్మాణాలను తొలగిస్తాం.

స్కూల్ గ్రాంట్స్ స్వాహా..

- విద్యాశాఖ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి చేతివాటం
- రూ.1.80 కోట్లు సొంత ఖాతాకు బదిలీ!
- ఉన్నతాధికారులకు నివేదించిన డీఈవో
- కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు

ఖమ్మం ఎడ్యుకేషన్, జూలై 7 : ఖమ్మం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో పని చేస్తున్న ఓ సాధారణ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఏకంగా స్కూల్ గ్రాంట్స్ రూ.1.80 కోట్లు కొట్టేశాడు. వివరాల్లోకెళ్తే.. రాష్ట్ర ప్రభుత్వం 2022-23 విద్యాసంవత్సరానికి సంబంధించి పాఠశాలల అభివృద్ధికి నిధులు విడుదల చేసింది. ప్రభుత్వం విడుదల చేసే స్కూల్ గ్రాంట్స్ పాఠశాలలకు సంబంధించి ఏపీ ఖాతాలో పడతాయో పరిశీలించే విభాగంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా రామకృష్ణ విధులు నిర్వర్తిస్తున్నాడు. స్కూల్స్‌కి చేరుతున్న నిధులను దారి మళ్లించాలని స్కెచ్ వేశాడు. అనుకున్నదే తడవుగా తన ప్రణాళికను అమలు చేశాడు. స్కూల్స్ ఖాతాల్లో పడిన నగదును తన వ్యక్తిగత ఖాతాకు మళ్లించాడు. సుమారు రూ.1.80 కోట్లు స్వాహా చేసినట్లు విద్యాశాఖాధికారుల అంచనా. పాఠశాలల ఖాతాలోని నగదును తిరిగి తన ఖాతాలో వేసుకునేందుకు 'పేమెంట్ ప్రింట్ అడ్వైస్' ద్వారా సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుడి సంతకం, సీనియర్ ఉపాధ్యాయుడి సంతకాలను ఫోర్జరీ చేసినట్లు అధికారులు గుర్తించారు. సుమారు 20 పాఠశాలలకు సంబంధించిన స్కూల్ గ్రాంట్‌ను రామకృష్ణ వ్యక్తి గత ఖాతాలోకి మళ్లించినట్లు తెలుసుకున్నారు. గత సంవత్సరానికి సంబంధించిన గ్రాంట్ తమ స్కూల్ ఖాతాలో జమ కాలేదని శనివారం సింగరేణి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డీఈవోకి ఫిర్యాదు చేయడంతో తీగ లాగితే కొండంత కదిలినట్లు విషయం బయటపడింది.

ఉన్నతాధికారులకు డీఈవో నివేదిక

విద్యాశాఖ ఉద్యోగి చేతివాటం ప్రదర్శించిన అంశంపై డీఈవో సోమశేఖరశర్మ శనివారం రాత్రి కలెక్టర్‌కు, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌కు నివేదికను అందించారు. కలెక్టర్ సూచన మేరకు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు ఫైల్ చేశారు. పాఠశాలలకు సంబంధించిన ఖాతాలు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ఖాతా త్రీటౌన్ పరిధిలోని ఒకే బ్యాంక్‌లో ఉండడంతో బ్యాంక్ అధికారులను సైతం పోలీసులు అనుమానిస్తూ విచారణ చేస్తున్నారు. సుమారు రూ.28 లక్షల వరకు తన వ్యక్తిగత బ్యాంక్ అకౌంట్‌కు మళ్లించి వినియోగించుకున్నట్లు రామకృష్ణ రాతపూర్వకంగా అంగీకరించాడని డీఈవో సోమశేఖర శర్మ ఈ సందర్భంగా తెలిపారు.

అడుగడుగునా వేధింపులే..!

- జనాలకు చుక్కలు చూపిస్తున్న కాంగ్రెస్ సర్కార్
- ప్రభుత్వ ఉద్యోగులు, రైతులు ఆత్మహత్యల బాట
- కేసీఆర్ హయాంలో ప్రజలు సుభిక్షం
- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధు
- రైతు భద్రయ్య, ఉద్యోగ నేత అఫ్జల్‌కు పరామర్శ

రైతు భార్యను ఓదార్చుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి

ఖమ్మం సిటీ, జూలై 7 : 'తెలంగాణలో మార్పు రావాలన్నారు.. కల్లబొల్లి మాటలతో అధికార పీఠాన్ని దక్కించుకున్నరు.. అందలం ఎక్కిన నాటినుంచి కాంగ్రెస్ పాలకులు ప్రజలకు పట్టపగలే చుక్కలు చూపిస్తున్నారు' అని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వరరెడ్డి ధ్వజమెత్తారు. తన పట్టా భూమిని ఆక్రమించారనే ఆవేదనతో కారేపల్లి మండలం ఉసిరికాయపల్లి గ్రామానికి చెందిన రైతు పచ్చిపాల భద్రయ్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంగతి విదితమే. ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ విషమంగా ఉన్న బాధితుడిని, కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఆదివారం జిల్లా పార్టీ నాయకులతో కలిసి పరామర్శించారు. ఆయన్ని చూసిన కుటుంబీకులు భావోద్వేగానికి గురై బోరున విలపించారు. వారిని అక్కున చేర్చుకుని ఓదార్చిన అనంతరం ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలనను పక్కనబెట్టి అన్నివర్గాలకు చెందిన వారిని వేధిస్తోందని విమర్శించారు. ప్రధానంగా రైతుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా వైఫల్యం చెందినదన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, అధికార పార్టీకి చెందిన పలువురు పేద రైతుల భూములను ఆక్రమించుకోవడం, ప్రశ్నిస్తే దాడులు చేయడం సర్వసాధారణంగాఆ మారిందని తెలిపారు.

వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే..

కాంగ్రెస్ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా రైతులు, ప్రభుత్వ ఉద్యోగులు ఆత్మహత్యల బాట పట్టారని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వరరెడ్డి అన్నారు. అనతికాలంలోనే ఖమ్మం జిల్లాలో మూడు ఘటనలు చోటుచేసుకున్నాయన్నారు. ఇదేనా తెలంగాణ సమాజం కోరుకున్నదని అని ప్రశ్నించారు. ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే రోజులు ఎంతో దూరంలో లేవన్నారు. ఖమ్మంజిల్లాలో ఆత్మహత్యలు చేసుకుంటున్న అన్నదాతలకు భరోసా నింపేందుకు తమ అధినేత కేసీఆర్ ప్రతినిధిగా వచ్చానని ఎమ్మెల్యే పల్లా స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లా కాలం ఉండదని, రోజులు దగ్గరపడ్డాయన్నారు. గడిచిన తొమ్మిదిన్నరేండ్లు సకల జనులు సుభిక్షంగా ఉన్నారన్నారు. ప్రస్తుతం సాగు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే అని రైతాంగం, అన్ని వర్గాల ప్రజలు ఆత్మహత్యలకు పాల్పడవద్దని, ధైర్యంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, ఏనుగుల రాకేష్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయం ఇన్‌చార్జి ఆర్జేసీ కృష్ణ, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, కారేపల్లి మండల నాయకుడు జడల వెంకటేశ్వర్లు, ఉద్యమకారులు బిచ్చాల తిరుమలరావు, పగడాల నరేందర్, లింగనబోయిన సతీష్ పాల్గొన్నారు.

అఫ్జల్‌హసన్‌కు బీఆర్ఎస్ నేతల పరామర్శ..

కాంగ్రెస్ ప్రభుత్వం పేరు చెప్పుకుని కొందరు జిల్లా అధికారులు, ఉద్యోగులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని జీర్ణించుకోలేక టీఎన్జీవోస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు షేక్ అఫ్జల్‌హసన్ శనివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యసేవలు అందిస్తున్నారు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఆయన్ని బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా పార్టీ కార్యాలయ ఇన్‌చార్జి ఆర్జేసీ కృష్ణ, నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు దవాఖానకు వెళ్లి పరామర్శించారు. స్థానిక వైద్యులతో మాట్లాడి అఫ్జల్ ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్కరికీ రక్షణ లేకుండా పోయిందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పేరు చెప్పుకుని కొందరు చెలరేగి పోతున్నారని, అన్ని అంశాలను ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. ప్రస్తుతం ప్రజలందరూ కేసీఆర్‌ను కోరుకుంటున్నారని, వచ్చేది కూడా బీఆర్ఎస్ సర్కారే అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నేతల బెదిరింపులకు భయపడి ఎవ్వరూ ఆత్మహత్యలకు పాల్పడవద్దని, బాధితులందరికీ తాము అండగా ఉంటామని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మైనార్టీ నేతలు ఎండీ తాజుద్దీన్, షేక్ షకీనా, న్యాయవాది బిచ్చాల తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

కారు కొంటూరా?

నేడు కారు ప్రతి ఒక్కరికీ అవసరంగా మారుతున్నది. నిజంగా చెప్పాలంటే కారు కొనేందుకున్న అవకాశాలూ అందరికీ పెరిగిపోయాయిప్పుడు. చాలామంది ఆర్థిక స్థోమత బలపడటంతో కార్ల అమ్మకాలూ జోరుగా సాగుతున్నాయి. అయితే కారు అంటే ఖర్చుతో కూడుకున్న వ్యవహారమే. సొంతింటి తర్వాత చాలా మంది కల కారు కొనుగోలేననడంలో ఎలాంటి సందేహం లేదు. అందుకే కారు కొనుగోలులో తెలివిగా వ్యవహరించండి.

ఏం చేయాలి.. ఏం చేయొద్దు

ఇవి గుర్తుంచుకోండి

✓మార్కెట్‌లో అందుబాటులో ఉన్న వివిధ కార్ల మాడళ్లను, వాటి ధరలను, రుణ సదుపాయాలను పూర్తిగా పరిశీలించండి.

✓మీ బడ్జెట్‌కు తగ్గ కారు దొరికేదాకా వెతకండి. ధరతోపాటు నిర్వహణ, బీమా, ఇతరత్రా వ్యయాలనూ దృష్టిలో పెట్టుకొని నిర్ణయం తీసుకోండి.

✓తుది నిర్ణయం తీసుకొనే ముందు టెస్ట్ డ్రైవ్‌కు సమయం తీసుకోవాలి. ఆపైనే కారు కొనుగోలుకు వెళ్లడం ఉత్తమం.

✓కారును కొనే ప్రక్రియలో మీపై ఏవైనా తెలియని చార్జీల భారం ఉంటున్నదా? అని గమనించండి. అనవసరంగా ఏ సర్వీసునూ తీసుకోవద్దు.

✓సంతకాలు పెట్టే ముందు ఒకటికి రెండుసార్లు డాక్యుమెంట్లను పూర్తిగా చదవండి. ఫైనాన్స్, లీజ్ అగ్రిమెంట్ల నియమనిబంధనలను, షరతులను తెలుసుకోండి.

ఇవి చేయండి



బడ్జెట్ వేసుకోవాలి

కారు కొనాలన్న ఆలోచన రాగానే ముందుగా బడ్జెట్ సెట్ చేసుకోండి. దీనివల్ల మీ కష్టార్జితం వృథా కాకుండా జాగ్రత్త పడవచ్చు. స్థోమతకు మించిన ఖర్చులకెళ్లడం లేనిపోని కష్టాలనే తెచ్చిపెడుతుంది. ఇక కారుకు చెల్లించే అధిక ధర.. బీమా, చెల్లించే వడ్డీలను ప్రభావితం చేయగలదని మర్చిపోవద్దు.

ఫీచర్లు చూడాలి

ఒకప్పుడు కారు అంటే.. కేవలం ప్రయాణ సాధనమే. కానీ ఇప్పుడు అంతకు మించేనని చెప్పవచ్చు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా నేడు వస్తున్న కార్లలో ఎన్నో ఫీచర్లుంటున్నాయి. కాబట్టి రకరకాల కంపెనీలు తెస్తున్న కార్ల గురించి, వాటిలోని ఫీచర్ల గురించి పూర్తిగా తెలుసుకొని మార్కెట్‌లోకి అడుగుపెట్టండి. ఇందుకోసం సంప్రదాయ, ఆన్‌లైన్ వేదికలను వాడుకోండి.

టెస్ట్ డ్రైవ్ చేయాలి

మీరు ఎంచుకున్న బడ్జెట్‌లో వస్తున్న ప్రతీ కారునూ టెస్ట్ డ్రైవ్ చేయండి. అప్పుడే మీకు సౌకర్యవంతమైన వాహనాన్ని సొంతం చేసుకోగలరు. అంతేగాక టెస్ట్ డ్రైవ్‌లో రకరకాల రోడ్లపై కారు ఎలా ప్రయాణిస్తున్నది, లోపల కూర్చున్నవారికి ఎలా అనిపిస్తున్నది? అన్నదానిపైనా అవగాహన వస్తుంది. కారులోని లోపాలనూ గుర్తించవచ్చు.

ఫైనాన్స్‌కు వెళ్తే..

నేరుగా నగదు కంటే ఫైనాన్స్ ద్వారా కారు కొనేవారే ఎక్కువ. మీరూ ఆ దారిలోనే వెళ్లాలనుకుంటే ఏయే బ్యాంకుల్లో వాహన రుణాలపై ఎంతెంత వడ్డీరేట్లున్నాయి? ఇతర చార్జీల మాటేంటి అన్నది ఆరా తీయండి.

ఇవి చేయకండి

తొందరపడి..

కారును చూసో.. ఆయా సంస్థలు, డీలర్లిచ్చే ఆఫర్లకు ఆకర్షితులయ్యో.. ఎవరి బలవంతంతోనో.. కొనేందుకు బయలుదేరవద్దు. కుటుంబ సభ్యులతో చర్చించి, అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకునే ఓ నిర్ణయానికి రావాలి. అప్పుడే ఎల్లవేళలా మీకు వారి మద్దతుంటుంది.

ఎక్కువ ఈఎంఐలు వద్దు

రుణ వాయిదాలను పెంచుకుంటే మీపై భారం తగ్గుతుందని డీలర్లు చెప్తే దాన్ని నమ్మవద్దు. ఎందుకంటే ఈఎంఐలు పెరిగితే మీపై వడ్డీ భారం పెరుగుతుంది. కాబట్టి ఈఎంఐ ఎక్కువైనా.. వీలైనంత త్వరగా రుణ విముక్తులయ్యేందుకే మొగ్గు చూపండి. డౌన్ పేమెంట్ ఎక్కువగా కడితే రిలీఫ్‌గా ఉంటుంది.

ఊ కొట్టొద్దు

చెప్పిన ధరకే కాకుండా డీలర్లతో ఇంకా రేటు తగ్గేదాకా సంప్రదింపులు జరుపండి. డాక్యుమెంటేషన్, డెస్టినేషన్ చార్జీలు, పన్నులు, ఇతరత్రా ఫీజుల గురించి తెలుసుకొని, వాటిని వీలైనంత వరకు దూరం చేసుకునేలా మాట్లాడండి. బెటర్ డీల్‌కు ప్రయత్నించండి. కారు కొన్న తర్వాత అదనపు యాక్సరీస్ బిగించుకోవడంలోనూ జాగ్రత్త వహించి అవసరమైతేనే ముందుకెళ్లండి.

పాత కారు విషయంలో..

మీకు పాత కారు ఉంటే దాన్ని అమ్మే విషయంలో తొందరపడవద్దు. ఎక్కువ ధర వస్తున్నదని అమ్ముకుంటే.. కొత్త కారు విషయంలో ఏదైనా తేడా కొడితే అనవసరపు ఇబ్బందుల్ని ఎదుర్కోవాల్సి వస్తుంది.

రాబడి

గత ఆర్థిక సంవత్సరానికి (2023-24)గాను ఆదాయ పన్ను రిటర్న్ (ఐటీఆర్)ల దాఖలుకున్న గడువు ఈ నెలాఖరే (జూలై 31). అయితే కొత్త పన్ను విధానంలో అనేక మార్పులొచ్చాయి. కాబట్టి వాటిని గుర్తుంచుకుంటే మంచిది.

ఈ మార్పులు తెలుసా?

- *2023-24 మొదలు కొత్త పన్ను విధానం డీఫాల్ట్ హోదాను అందుకున్నది. కనుక పన్ను మినహాయింపులను ఆశించే వేతన జీవులు వారి కంపెనీ యాజమాన్యాలకు పాత పన్ను విధానాన్ని కోరుకుంటున్నట్టు తెలియపర్చాలి. లేకపోతే కొత్త పన్ను విధానం పరిధిలో మీకు పన్ను రేట్లు వర్తిస్తాయి.*
- *కొత్త విధానంలో రిబేటు పరిమితి రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షలకు పెరిగింది. మీకు వార్షిక వేతనం రూ.7.5 లక్షలున్నా పన్ను కట్టనక్కర్లేదు. స్టాండర్డ్ డిడక్షన్ మరో రూ.50,000 ఉండటమే కారణం. పెన్షనర్లకూ ఈ ప్రయోజనం ఉంటుంది.*
- *కొత్త పన్ను విధానాన్ని ఆకర్షణీయంగా మార్చేందుకు ఐటీ స్లాబులను 6 నుంచి 5కు తగ్గించారు. వార్షిక ఆదాయం రూ.3 లక్షలదాకా పన్నుండదు. రూ.3-6 లక్షల మధ్య 5%, రూ.6-9 లక్షల మధ్య 10 %, రూ.9-12 లక్షల మధ్య 15 %, రూ.12-15 లక్షల మధ్య 20 %, రూ.15 లక్షలు దాటితే 30 % పన్నుంటుంది.*



పీపీఎఫ్ ఖాతా లాభాలివే..

పొదుపునకు, దీర్ఘకాలిక మదుపునకు పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్) చక్కని సాధనం. పన్ను ప్రయోజనాలను కల్పిస్తూ వ్యక్తుల ఆదాయ వృద్ధికి దోహదం చేస్తుంది. పీపీఎఫ్ వడ్డీరేట్లను కేంద్ర ప్రభుత్వం నిర్ణయిస్తుంది. 3 నెలలకోసారి సమీక్ష జరుగుతుంది. ప్రస్తుత వార్షిక వడ్డీరేటు 7.1 శాతం. కనీసం 15 ఏండ్ల లాకిన్ పీరియడ్‌తో ఐదేండ్లు నిరవధికంగా ఖాతాను పొడిగించుకోవచ్చు. ఈ ఖాతా లాభాలను పరిశీలిస్తే..

అధిక వడ్డీరేట్లు

పీపీఎఫ్‌లో వడ్డీరేట్లు సాధారణంగా 7-8 శాతంగా ఉంటాయి. సేవింగ్స్ ఖాతా వడ్డీరేటు 3-4 శాతమే. అందుకే పీపీఎఫ్ ఖాతాలు ఆకర్షణీయంగా మారాయి.

పన్ను ప్రయోజనాలు

ఖాతాలో జమయ్యే మొత్తాలతోపాటు వాటిపై పొందే వడ్డీ ఆదాయానికీ ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపులుంటాయి. ప్రతీ ఆర్థిక సంవత్సరం తమ పీపీఎఫ్‌కు ఖాతాదారులు రూ.500కు తగ్గకుండా, రూ.1.5 లక్షలకు మించకుండా జమ చేసుకోవచ్చు.

సురక్షిత పెట్టుబడి

కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకమే పీపీఎఫ్. కాబట్టి ఇదో సురక్షిత పెట్టుబడి. కచ్చితమైన, స్థిరమైన రాబడులుంటాయి. స్టాక్ మార్కెట్ లేదా మ్యూచువల్ ఫండ్స్‌ల్లో పెట్టుబడులకున్న రిస్క్ ఇక్కడ ఉండదు.

రుణ సౌకర్యం

ఖాతాదారులు తమ ఖాతాలో ఉన్న నిల్వల్లో 25 శాతం వరకు రుణంగా తీసుకోవచ్చు. ఖాతా తెరిచిన ఐదేండ్ల తర్వాత కొద్ది కొద్దిగా (బ్యాలెన్స్‌లో 50 శాతం వరకు) నగదునూ ఉపసంహరించుకోవచ్చు.

పీపీఎఫ్ ఖాతాకు ఎవరు అర్హులు?

✓భారతీయ పౌరులై ఉండాలి.
✓ఖాతాను కేవలం ఒక్కసారే తెరవగలం.
✓మేజర్లు అయ్యేదాకా మైనర్ల పేరిట వారి తల్లిదండ్రులు లేదా సంరక్షకులు పీపీఎఫ్ ఖాతా తెరిచి నిర్వహించవచ్చు.

ఏయే పత్రాలు కావాలి?

✓ఓటర్ ఐడీ, పాస్‌పోర్ట్, ఆధార్ కార్డ్, పాన్ కార్డ్ తదితర కేవైసీ ధ్రువీకరణలు.
✓ఇటీవలి పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు.
✓అకౌంట్ తెరిచే ఫారం.
✓నామినీ వివరాలు.

ఖాతాను ఎలా తెరవాలి?

✓ప్రధాన బ్యాంకులన్నింటిలో ఈ ఖాతా సౌకర్యం ఉంటుంది.
✓బ్యాంక్ వెబ్‌సైట్ లేదా మొబైల్ బ్యాంకింగ్ యాప్‌లోకి లాగిన్ అవ్వాలి.
✓'ఓపెన్ ఏ పీపీఎఫ్ అకౌంట్' ట్యాబ్‌ను ఎంచుకోవాలి.
✓మైనర్ల కోసం అయితే 'మైనర్ అకౌంట్', మీ కోసమే అయితే 'సెల్ఫ్ అకౌంట్'ను ఎంచుకోవాలి.
✓ఆపై అడిగిన వివరాలన్నీ దరఖాస్తు ఫారంలో నింపి సరిచూసుకోవాలి.
✓ప్రతీ ఆర్థిక సంవత్సరం మీరు డిపాజిట్ చేసే మొత్తాన్ని పేర్కొనాలి.
✓పీపీఎఫ్ ఖాతాలోకి మీ సేవింగ్స్ ఖాతా నుంచి డిపాజిట్లు వెళ్లేందుకు అనుమతులివ్వాలి.
✓ఓటీపీని పొందేందుకు మీ రిజిస్టర్డ్ మొబైల్ నెంబర్‌ను ఎంటర్ చేయాలి.
✓ఓటీపీని ఎంటర్ చేసి ధ్రువీకరించుకోవాలి.
✓ఆపై మీ ఖాతా మొదలవుతుంది. ఈ సమాచారం మీకు ఫోన్ మెసేజ్ లేదా ఈ-మెయిల్ ద్వారా వస్తుంది.

ఆటుపోట్లకు అవకాశం

గత వారం కూడా దేశీయ స్టాక్ మార్కెట్లలో రికార్డుల మోత మోగింది. సూచీలు జీవనకాల గరిష్ఠాల వద్ద ఉన్నా.. మదుపరులు పెట్టుబడులకే ఆసక్తి కనబర్చారు. అక్కడక్కడా అమ్మకాల ఒత్తిళ్లకు లోనైనా.. ఓవరాల్‌గా మాత్రం కొనుగోళ్లతో కదం తొక్కారు. దీంతో ఈక్విటీ మార్కెట్లు నయా ఆల్‌టైమ్ హైలను సృష్టించాయి. ఫలితంగానే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 963.87 పాయింట్లు ఎగిసి 80 వేలకు కూతవేటు దూరంలో 79,996.60 వద్ద స్థిరపడింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 313.25 పాయింట్లు ఎగబాకి 24వేల స్థాయికి ఎగువన 24,323.85 దగ్గర నిలిచింది. నిజానికి సెన్సెక్స్ తొలిసారి 80 వేలను దాటిపోయింది. నిఫ్టీ కూడా 24,400 పాయింట్లను అధిగమించింది. అయితే మదుపరులు లాభాల స్వీకరణ వైపు నడిచారు. దీంతో ఈ చారిత్రక స్థాయిల్లో సూచీలు నిలబడలేకపోయాయి. ఈ క్రమంలో ఈ వారం మదుపరులు పెట్టుబడులు, అమ్మకాల నడుమ ఊగిసలాటకు గురికావచ్చన్న అంచనాలున్నాయి. అందుకే సూచీల ఆటుపోట్లకు అవకాశాలున్నాయని మెజారిటీ ఎక్స్‌పర్ట్స్ అంటున్నారు. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఎప్పట్లాగే ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 23,900 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 23,700 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 24,700-24,900 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S. No. 225/A2, V.Venkataiah Palem, Opp: Chintakani Road, Khammam Urban Mandal, Dist: KHAMMAM - 507 318
Published At Telangana Publications Pvt Ltd. S. No. 225/A2, V.Venkataiah Palem, Opp: Chintakani Road, Khammam Urban Mandal, Dist: KHAMMAM - 507 318, Telangana State. Editor: Thigulla Krishna Murthy. Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38363.